నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 28 ఫిబ్రవరి 2024 | NIZAMABAD

## బీజేపీకి ఓటేయకుంటే నరకానికి పోతారు

### నిజామాబాద్ ఎంపీ అర్వింద్ వ్యాఖ్య


కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 27: బీజేపీకి ఓటు వేయకుంటే నరకానికి పోతారని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి వ్యాఖ్యానించారు. బాల్కొండ నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన భీమ్ విజయ సంకల్ప యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో కలిసి అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు మోదీ ప్రభుత్వం రుణాలిస్తుందని, ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. బీజేపీ పెట్టిన తిండి తిని ఓటు వేయని వారు నరకానికి పోతారన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వెంటనే హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ ప్రధాని అయ్యేది లేదు.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసేది లేదని డీకే అరుణ ఎద్దేవా చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే గ్యారంటీల అమలు సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి అనడం.. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజలను మరోసారి మోసం చేసే కుట్రేనని విమర్శించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.


నిజామాబాద్‌లోని ఓ పరీక్షాకేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

# సీటు వదలం..

## టీఎన్జీవోలో అనర్హులు!

కీలక పదవులు వదలని పలువురు
బై లాను తుంగలో తొక్కి ఇష్టారాజ్యం
సంఘం నేతలపై మండిపడుతున్న వైనం
ప్రభుత్వాలను తప్పుదారి పట్టిస్తూ కుటిల నీతి
సంఘం పేరుతో రాజకీయ నేతలతో చెట్టాపట్టాల్




నిజామాబాద్, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి) తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం సంక్షిప్తంగా టీఎన్జీవో. తెలంగాణలో పరిచయం అక్కర్లేని ఉద్యోగ సంఘం ఇది. స్వరాష్ట్ర సాధనలో టీఎన్జీవోలు పోషించిన పాత్ర అమోఘం. ఉద్యోగుల సమస్యలు, ఇక్కట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు అధికారిక సంఘంగా టీఎన్జీవోకు స్థానం ఉన్నది. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఉద్యోగులకు మాత్రమే ఇందులో సభ్యత్వం ఉంటుంది. కేఆర్ ఆమోస్ సారథ్యంలో ఏర్పాటైన ఈ సంఘానికి చారిత్రక నేపథ్యంతోపాటు కఠినమైన నియమ, నిబంధనలను పాతతరం ఉద్యోగ సంఘం నాయకులు తీర్చిదిద్దారు. నిబంధనల ప్రకారమే విధి విధానాలు, కార్యకలాపాలు జరగాలని మార్గనిర్దేశనం చేశారు. కానీ ప్రస్తుతం టీఎన్జీవోలో రాజకీయ నేతలను తలదన్నే రీతిలో ఉద్యోగ సంఘం లీడర్లు మారిపోయారు. ఒకానొక దశలో పొలిటికల్ లీడర్ల కన్నా మిన్న అన్నట్లుగా చెలరేగిపోతూ ఉద్యోగుల సంక్షేమాన్ని పక్కన పెట్టేస్తున్నారు. ఇలా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ టీఎన్జీవోకే మాయని మచ్చగా మారిన నేతలపై టీఎన్జీవోలో ఆగ్రహావేశాలు పెరుగుతున్నాయి. నియంతృత్వ ధోరణిని కొనసాగిస్తూ... ఏకపక్ష ఎన్నికలతో పదవులను జల్సా చేస్తున్న వారిపై సభ్యులంతా మండిపడుతున్నారు. ప్రభుత్వాలను తప్పుదారి పట్టిస్తూ సొంత ప్రయోజనాల కోసం పాకులాడుతూ ఉద్యోగుల సంక్షేమాన్ని పక్కదారి పట్టిస్తుండడంపై చర్చ జరుగుతున్నది.

### నిజామాబాద్‌లో జరుగుతున్నదేంది?

నిజామాబాద్ టీఎన్జీవోలో బై లాను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి టీఎన్జీవో సంఘం పేరులోనే నాన్ గెజిటెడ్ అనే పదం ఉన్నప్పటికీ గెజిటెడ్ అధికారులే రాజ్యమేలుతున్నారు. పచ్చ ఇంకు పెన్ను పట్టుకునే వారెవ్వరికీ ఈ సంఘంలో చోటు లేదు. ప్రమోషన్ల పేరిట ఉన్నత ఉద్యోగాలకు వెళ్లిన వారు ఆటోమెటిక్‌గా టీఎన్జీవోలో చోటును కోల్పోతారు. కానీ అలాంటిదేమీ లేకుండానే ప్రస్తుతం కొంతమంది కీలకమైన పదవుల్లోనే కొనసాగుతూ కింది స్థాయిలోని లీడర్లను ఎదగనివ్వకుండా అడ్డుతగులుతున్నారు. గెజిటెడ్ హోదాలో అధికార దర్పాన్ని, టీఎన్జీవో సంఘంలో పదవులను అనుభవిస్తూ ద్వంద్వ నీతిని పాటిస్తుండడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇదేంటని అడిగితే రాజకీయ నేతల పేరు చెప్పి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. నోరెత్తిన వారిపై సదరు శాఖ ఉన్నతాధికారులతో మెమోలు ఇప్పించడం, శాఖాపరమైన ఇక్కట్లను సృష్టిస్తున్న ఘటనలు సైతం ఉన్నాయి. ఉన్నతాధికారులకు లేనిపోనివి నూరి పోసి చివాట్లు పడేలా చేయడం వంటివి ఇక్కడ జరుగుతున్నట్లుగా తెలుస్తున్నది. బడా రాజకీయ నేతలతో కలిసి మెలిసి తిరుగుతూ ఉద్యోగుల ప్రయోజనాలను పక్కదారి పట్టిస్తున్న వారి నుంచి టీఎన్జీవోను రక్షించాలనే దృఢ సంకల్పంతో ఇప్పుడు చాలా మంది కదం తొక్కుతున్నారు. ప్రస్తుతం కీలకమైన పదవుల్లో ఉన్న వారికి టీఎన్జీవోను నడిపే అధికారమే లేదని బాహటంగానే చెప్పుకొస్తున్నారు.

> **ప్రభుత్వానికి నివేదించాం**
>
> టీఎన్జీవో సంఘానికి గెజిటెడ్ ఉద్యోగులు బాధ్యత వహించడంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్‌ను ''నమస్తే తెలంగాణ'' వివరణ కోరింది. ఈ అంశం తమ పరిశీలనలో ఉన్నదని, ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక సమర్పించినట్లుగా చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే స్పందన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
>
> **- మారం జగదీశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎన్జీవో**

కేంద్ర నాయకత్వానికి సైతం ఇదేం పద్ధతంటూ ఫిర్యాదులు చేస్తున్నారు.

### జీఏడీకి ఫిర్యాదులు...

నిజామాబాద్‌కు చెందిన కొంతమంది సీనియర్ సిటిజన్లు సాధారణ పరిపాలన శాఖకు ఈ వ్యవహారాలపై ఫిర్యాదు చేశారు. టీఎన్జీవో బైలాను ఉల్లంఘించిన వారిపై చర్యలకు డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. అయితే ప్రభుత్వం మారిందో లేదో టీఎన్జీవోలో అర్హత లేకున్నప్పటికీ పదవులు అనుభవిస్తున్న వ్యక్తులు ఇప్పటికే పైరవీలు మొదలు పెట్టారు. తమ సీటుకు ఎసరు రాకుండా చూసుకునేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పెద్ద లీడర్లను కలుస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకుంటూ టీఎన్జీవో కేంద్ర నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి జిల్లా స్థాయిలో తమ పదవులకు ఢోకా రాకుండా చూసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ మధ్యనే ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన షబ్బీర్ అలీని, ఎమ్మెల్సీగా ఎన్నికైన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్‌ను బుట్టలో వేసుకునే పనిలో పడ్డారు. అకస్మాత్తుగా ఉద్యోగ సంఘం నేతల హడావుడిని చూసిన వారంతా వీళ్లు మామూలోళ్లు కాదంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. టీఎన్జీవోలో సంఘం సభ్యుల నుంచి వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు వారందరినీ ప్రసన్నం చేసుకునే పనిలో పడడంపై అందరూ మండిపడుతున్నారు. యూనిఫార్మ్ సర్వీసులకు టీఎన్జీవోలో చోటు లేదు. బై లా ఇదే చెబుతున్నప్పటికీ నిజామాబాద్‌లో ఏకంగా జిల్లా స్థాయి పోస్టును ఎక్సైజ్ శాఖకు చెందిన వారికి అప్పగించారు. డివిజన్ స్థాయిలోనూ గెజిటెడ్ హోదా ఉన్న వారికి టీఎన్జీవోలో పదవులివ్వడం కొసమెరుపు.

## నేటి నుంచే ఇంటర్ ఎగ్జామ్స్

ఆన్‌లైన్ హాల్‌టికెట్లను అనుమతించనున్న అధికారులు
నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ఖలీల్‌వాడి/కామారెడ్డి, ఫిబ్రవరి 27: ఇంటర్ పరీక్షలు నేటి (బుధవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 9 వరకు నిర్వహించనున్న పరీక్షల కోసం ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిర్ణీత సమయంలోగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షాకేంద్రాలను గుర్తించేందుకు సెంటర్ లొకేటర్ యాప్ రూపొందించారు. హాల్‌టికెట్‌ను నమోదు చేస్తే విద్యార్థి ఉన్న ప్రదేశం నుంచి పరీక్ష కేంద్రం ఎంత దూరంలో ఉంది, అక్కడకు ఎలా చేరుకోవాలనేది ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. మరోవైపు, ఫీజులు చెల్లించని విద్యార్థులకు కొన్ని ప్రైవేట్ కళాశాలలు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదన్న విమర్శలపై విద్యాశాఖ స్పందించింది. విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావచ్చని అధికారులు తెలిపారు. వాటిపై ప్రిన్సిపాల్ సంతకం కూడా అవసరం లేదని స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన 57 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 35,346 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇక, కామారెడ్డి జిల్లాలో 19,509 మంది విద్యార్థుల కోసం 37 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటల కల్లా విద్యార్థులు ఎగ్జామ్ సెంటర్లకు చేరుకోవాలని నిజామాబాద్ డీఐఈవో రఘురాజ్ తెలిపారు. మాల్ ప్రాక్టీస్ నివారణకు మూడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు ఎలాంటి పుకార్లు నమ్మవద్దని సూచించారు. పరీక్ష రాసే సమయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లోను కావొద్దని, బాగా చదివి ప్రతి ప్రశ్నకు సమాధానం రాయాలన్నారు.మార్చి 16 వరకు జరగబోయే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కామారెడ్డి జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఉదయం 8.15 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. సజావుగా పరీక్షలు నిర్వహించేందుకు 55 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 10 మంది అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదుగురు కస్టోడియన్స్‌ను నియమించినట్లు వివరించారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటరులు మూసివేయాలని సూచించారు.


కామారెడ్డిలోని ఓ పరీక్షాకేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

# యాసంగి యాడికొస్తదో..

### వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు
### ఆందోళనలో రైతాంగం



> **నీళ్లు లేక 30గుంటల పొలం ఇడిసిపెట్టిన**
>
> నిరుడు ఐదెకరాల్లో వరి పండించిన. ఎటువంటి ఇబ్బంది కాలేదు. ఈసారి కేవలం రెండున్నర ఎకరాల్లోనే వరి వేసిన. కానీ భూమిలో నీళ్లు లేక, కరెంటు సరిగ్గా ఉండక 30గుంటల పొలానికి నీళ్లు అందించలేకపోతున్న. 30 గుంటల పొలాన్ని పారియ్యకుంట ఇడిసిపెట్టిన. ఇప్పుడే గీ పరిస్థితి ఉంటే ముంగట ఎట్లుంటదో, ఏసిన పంటలకు నీళ్లు అందిస్తమో లేమోనన్న భయం ఉన్నది. ఈసారి యాసంగి పంటలతో నష్టాలపాలయ్యేటట్లే కనిపిస్తున్నది.
>
> **- బద్దం రాజశేఖర్, రైతు, కమ్మర్‌పల్లి**

మోర్తాడ్, ఫిబ్రవరి 27: నిరుడి వరకు రందీలేకుండా యాసంగి పంటలు పండించిన రైతులు ఈఏడు ఆగమాగమవుతుండ్రు. అందుకు ఎండాకాలం వచ్చిరాగానే భూగర్భజలాలు అడుగంటిపోవడమే కారణం. చలికాలంలో కూడా ఎండ తీవ్రత ఉండడం, ఎండాకాలం ఆరంభంలోనే ఏసిన పంటలకు నీళ్లందించలేక, కరెంటు వస్తూ పోతుండడంలాంటి సమస్యలతో జిల్లాలో యాసంగి పంటల పరిస్థితి యాడికొస్తదోనని రైతు లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల నీళ్లు అందించలేక నేలలు నెర్రలీడిన పరిస్థితులు కనిపిస్తున్న తరుణంలో పంటలు చేతికొస్తయా లేక పశువుల మేతకైతయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**పంటలను తగ్గించుకున్న రైతులు..**

వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టాలు, కరెంటు పరిస్థితులు ఎట్లుంటయో తెలియని అయోమయ పరిస్థితుల్లో చాలమంది రైతులు నిరుడు యాసంగిలో వేసిన పంటలకన్నా ఈసారి తగ్గించుకున్నారు. నువ్వు, సజ్జ పంటలు పండించే రైతులు సజ్జ వేస్తే నువ్వు, నువ్వు వేస్తే సజ్జ వేయలేని పరిస్థితి. కొంతమంది రైతులు వరి పంట విస్తీర్ణాన్ని కూడా తగ్గించుకున్నారు. మరి కొంత మంది పంటవేసినా పూర్తిస్థాయిలో సరిపడా నీళ్లు లేక వేసిన పంటను వదిలేసుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యాసంగి సాగుపై రైతన్న ఆగమాగమవుతుండు. మరోవైపు గత సంవత్సరం వ్యవసాయానికి విద్యుత్ రోజంతా ఇచ్చారని, కానీ ఇప్పుడు సరిపడా విద్యుత్ ఇస్తున్నా ఎప్పుడు పోతుందో? ఎప్పుడు వస్తుందో? తెలియని పరిస్థితుల్లో పైప్‌లైన్లు, మోటార్లు చెడిపోయే ప్రమాదం ఉన్నదని రైతులు వాపోతున్నారు.



> **ఎకరంలోనే వరి వేసిన..**
>
> నిరుడు రెండెకరాల్లో వరి వేసిన. ఇప్పుడు మాత్రం ఒక ఎకరంలనే పంట వేసిన. నిరుటి వరకు పంటలకు నీళ్లు పారిచ్చేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండే. ఈసారి బోర్లు సరిగా పోస్తలేవు. కరెంటు వస్తూపోతూ ఉన్నది. ఎంజేయాల అర్థంగాక రెండెకరాలెందుకని ఎకరంలోనే వరి వేసిన, మరో ఎకరం సాగుజేయకుండా ఇడిసిపెట్టిన.
>
> **- గద్దల గంగాధర్, రైతు, బట్టాపూర్**

## లక్ష, తులం బంగారం ఏమాయె..?

### కాంగ్రెస్‌వి అమలుకాని హామీలు
### మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
### 222 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బాన్సువాడ, ఫిబ్రవరి 27: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి పథకం కింద ఇస్తామన్న రూ.లక్ష, తులం బంగారం ఎక్కడ దాచారని, ఇప్పటికీ కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన చెక్కులనే ఇస్తున్నామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన 222మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ పేదల బాధల్లో పాలుపంచుకున్న నాయకుడు కేసీఆర్ అని, ఆడబిడ్డల పెండ్లికి దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.లక్షా 116 అందించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీవి అమలుకాని హామీలని, ఇప్పటికీ రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. రూ.2లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ప్రతినెలా రూ.2500 లాంటి హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో బాన్సువాడ నియోజకవర్గంలో సుమారు 16వేల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.130కోట్లను అందించామన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఏజాస్, గురు వినయ్‌కుమార్, శశికాంత్, ఎంపీపీ రఘు, జడ్పీటీసీ పద్మ గోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

**దివ్యాంగులకు ట్రైస్కూటర్ల పంపిణీ**

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 27: బాన్సువాడ నియోజకవర్గంలోని ముగ్గురు దివ్యాంగులకు ప్రభుత్వం అందించిన ట్రైస్కూటర్లను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అందజేశారు. ట్రైస్కూటర్లను అందజేసేందుకు కృషి చేసిన ప్రభుత్వ అధికారులను అభినందించారు.

## ఉపాధ్యాయులు ఎపిక్ నంబర్లు అందించాలి

### కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఫిబ్రవరి 27: రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా డేటాబేస్ రూపొందించేందుకు ఉపాధ్యాయులు ఎపిక్ నంబర్లను అందించాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ కోరారు.డీఈవో, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో మంగళవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఓటరు ఐడీ ఎపిక్ నంబర్ ఇవ్వడంతో పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణకు వీలుంటుందన్నారు. పాఠశాలలో అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇక నుంచి పాఠశాలలను తనిఖీ చేసేందుకు సీనియర్ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు అనుమతి తీసుకొని సెలవులు తీసుకోవాలని, అధికారుల తనిఖీలో ఉపాధ్యాయులు గైర్హాజరైనట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు.


తైక్వాండో శిక్షణ పొందుతున్న మహిళా ఉద్యోగులు

## మహిళలకు ఆత్మరక్షణ తప్పనిసరి

### జిల్లా జడ్జి సునీత కుంచాల

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 27: మహిళలకు ఆత్మరక్షణ తప్పనిసరి అని, సెల్ఫ్ డిఫెన్స్ ఉన్నవారు ఎక్కడికైనా వెళ్లగరని, ఏదైనా ధైర్యంగా సాధిస్తారని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. నిజామాబాద్ నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్, ఫారెస్ట్, హెల్త్ డిపార్ట్‌మెంట్లలోని మహిళా సిబ్బందికి ఏర్పాటు చేసిన తైక్వాండో శిక్షణ కార్యక్రమాన్ని జడ్జి సునీత కుంచాల, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కాలేజీ మైదానంలో మార్చి 2వ తేదీన ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం 10వేల మంది మహిళలకు తైక్వాండో శిక్షణను ఇవ్వనున్నామని అన్నారు. మార్చి 2న జరిగే కార్యక్రమా న్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజావెంకట్ రెడ్డి, ఆర్ఐ రమేశ్, తైక్వాండో కార్యదర్శి కె.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లో నిరాహార దీక్ష చేస్తా..

### ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి పక్కన జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, ఫిబ్రవరి 27: సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌కు రూ.3వేల కోట్ల నిధులు తీసుకెళ్లి నిజామాబాద్ తదితర జిల్లాలకు అన్యాయం చేశారని, త్వరలోనే కొడంగల్‌కు పాదయాత్ర చేసి నిరాహార దీక్ష చేపడతానని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అన్నారు. మండలంలోని కల్లెడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ అధికారిక జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాలు సేవాలాల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు. తండాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ పార్టీలకతీతంగా నిధులు మంజూరు చేసి తండాలను అభివృద్ధి చేస్తామని, ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలని, అనంతరం అందరం కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ప్రహరీ నిర్మాణానికి రూ.2లక్షలు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్లు షబ్బీర్, సురేశ్, ఎంపీడీవో జయక్రాంతి, కార్పొరేటర్ రాయ్‌సింగ్‌నాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు గణపతి నాయక్, పీర్‌సింగ్ నాయక్, లత, లావణ్య పాల్గొన్నారు.